క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



కంటి రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

రాయచోటి జగదాంబసెంటర్ : లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో తిరుపతి ఎస్వీ అరవింద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో రాయచోటి పట్టణంలోని మెయిన్ రాజు స్కూల్ నందు నిర్వహించిన కంటి వైద్యశిబిరంలో ఆదివారం 180 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పి.శ్యామ్ తెలిపారు. అరవింద్ కంటి ఆసుపత్రికి చెందిన వైద్యులు డా.ప్రవల్లిక, డా.శ్రీలలితలు రోగులను పరీక్షించి 25 మంది శస్త్ర చికిత్స అవసరమని గుర్తించగా వారికి త్వరలోనే ఆపరేషన్లు నిర్వహించనున్నారు. వచ్చిన రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాన్ని అధ్యక్షుడు శ్యామ్ దాతృత్వంతో అందించారు. కార్యక్రమంలో లయన్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు హరినాథరెడ్డి, ఉపాధ్యక్షుడు హరీష్‌చంద్ర, కార్యదర్శి ఇందాద్ అహమ్మద్, కోశాధికారి మనోహర్‌రాజు, కౌన్సిలర్ జనని, వాలంటీర్ శ్రీకాంత్‌రెడ్డి, క్యాంపు ఇంచార్జి దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజానాయకుడిని కోల్పోయాం



వేణుగోపాల్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి టౌన్ : సంబేపల్లె మండలం దేవపట్ల సర్పంచ్ ఆవుల వేణుగోపాల్ రెడ్డి మృతి తీరని లోటని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. పార్టీ కోసమే కాకుండా ప్రజల కోసం ఆయన అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఒక ప్రజానాయకుడిని కోల్పోయామన్నారు. వేణుగోపాల్ రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని వెలిబుచ్చారు.

సత్ప్రవర్తనతో దైవ మార్గంలో నడవాలి

ఓబులవారిపల్లె : అందరూ సత్ప్రవర్తనతో దైవ మార్గంలో నడవాలని ఆఫస్ సాహెబ్ మొయినుద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మదీనా మసీదులో మండల మషోరా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొయినుద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దాన గుణంతోపాటు ఈర్ష్యా ద్వేషాలు విడనాడి కలసిమెలసి దైవ మార్గంలో నడవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మదీనా మసీదు కమిటీ సభ్యులు, ముస్లింలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

నాగారపమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

సుండుపల్లె : మండల పరిధిలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మకు శ్రావణమాసం సందర్భంగా ఆదివారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

జాంబవతుడికి పూజలు



అలంకరణలో జాంబవంతుడు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని అంకమ్మ నగర్‌లో వెలసివున్న జాంబవంతుడి ఆలయంలో ఆదివారం స్థానికుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో జాంబవంతుడికి అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మల్లయ్యకొండకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: తంబళ్లపల్లె సమీపంలోని మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 5.30 గంటలకు, 6.30 గంటలకు మదనపల్లె డిపో నుంచి బయలుదేరి మల్లయ్యకొండకు చేరుతుందన్నారు. తంబళ్లపల్లె రాగిమాను సర్కిల్ నుంచి మల్లయ్యకొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసు నడుస్తుందన్నారు. భక్తులకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

శ్రావణ మాసం.. సేల్స్ ఢమాల్!

- కేజీ చికెన్ రూ.180కి విక్రయిస్తున్న వైనం
- మరింత తగ్గే అవకాశం ఉందంటున్న వ్యాపారులు



రాయచోటి పట్టణంలో ఓ దుకాణం ముందు అమ్మకానికి ఉంచిన చికెన్



కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న రాయచోటిలోని చికెన్ దుకాణం

రాయచోటి జగదాంబసెంటర్ : శ్రావణమాసం ప్రారంభమైంది. హిందువులు ఈ మాసాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. దీంతో ఎక్కువ మంది ఆలయాలకు వెళ్లడంతో పాటు ఇళ్లలోనూ ప్రత్యేక పూజలు చేస్తుంటారు. దీనికితోడు నాగులచవితి సందర్భంగా ఎక్కువ మంది పుట్టకు పాలు పోస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రావణ మాసం ఎఫెక్ట్ చికెన్ ధరలపై పడింది. ఈ మాసంలో ఎక్కువ మంది నాన్‌వెజ్ ముట్టుకోరు. అధిక శాతం మంది ప్రత్యేక పూజలు, ఉపవాసాలు చేస్తూ ఉంటారు. అందుకే చాలా ఇళ్లలో ముక్క ముట్టరు. చికెన్ ధరలు తగ్గడానికి ఇది ప్రధాన కారణమని వ్యాపారులు చెబుతున్నారు. పౌల్ట్రీల్లో ఎదుగుతున్న కోళ్లను.. నిర్ణీత సమయం దాటిన తర్వాత అక్కడ ఉంచరు. అలా ఉంచితే దాణా నష్టం తప్ప, బిజినెస్ పరంగా ఎలాంటి లాభమూ ఉండదని చెబుతున్నారు. అందుకే జనం పెద్దగా మాంసాన్ని కొనుగోలు చేపట్టకపోయినా కూడా.. కోళ్లను చికెన్ షాపులకు తరలిస్తున్నారు. ఈ ఫలితంగానే ధరలు తగ్గాయంటున్నారు. శ్రావణమాసం మొదట్లోనే ధర ఇలా ఉంటే.. రాబోయే రోజుల్లో చికెన్ ధరలు మరింత తగ్గే అవకాశం ఉందంటున్నారు.

మార్కెట్లో చికెన్ ధరలు ఇలా..

చాలా రోజుల పాటు కేజీ చికెన్ ధర రూ.250 నుంచి రూ.200ల మధ్యలో అమ్మకాలు జరిగేవి. కానీ.. గడిచిన కొద్ది రోజులుగా చికెన్ ధరలు కిందకు దిగివస్తున్నాయి. ఆదివారం రాయచోటి మార్కెట్లో చికెన్(స్కిన్) కిలో రూ.180, స్కిన్‌లెస్ రూ.200కు అమ్ముతున్నారు.

కోడిగుడ్ల ధరలు కూడా..

కోడిగుడ్ల ధరలు సైతం శ్రావణ మాసం ప్రభావంతో కాస్త తగ్గుముఖం పట్టాయి. మార్కెట్లో 10 రోజుల క్రితం హోల్‌సేల్‌లో 100 కోడిగుడ్లు రూ.630 పలికాయి. ప్రస్తుతం హోల్‌సేల్ మార్కెట్లో 100 గుడ్ల ధర రూ.550 ఉన్నట్లు కోడిగుడ్ల హోల్‌సేల్ వ్యాపారులు చెబుతున్నారు.

వ్యాపారం తగ్గింది



శ్రావణమాసం కారణంగా మార్కెట్లో చికెన్ అమ్మకాలు కాస్త తగ్గాయి. మార్కెట్లో కిలో విత్ స్కిన్ రూ.180 పలుకుతుండగా వితవుట్ స్కిన్ రూ.200 వరకు అమ్మకం చేస్తున్నాం. రానున్న రోజుల్లో మరింతగా చికెన్ ధరలు తగ్గినా ఆశ్చర్యపోనవసరం లేదు. శ్రావణమాసం మొత్తం ఇలా ఉంటుందని అనుకుంటున్నాను.

– ఎం.గౌస్‌మొహిద్దీన్, చికెన్ వ్యాపారి, రాయచోటి

సారూ.. ఇటు పక్క చూడరూ



రోడ్డు పక్కన ప్రమాదకరంగా రాళ్లు



వర్షానికి గోతులమయమైన ప్రధాన రహదారి

సుండుపల్లె : రాయచోటి – సుండుపల్లె ప్రధాన రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డుకిరువైపులా వంకలు దొర్లి మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. ముందే ఒక వరుస రహదారి కావడంతో అందులోనూ అక్కడక్కడ గుంతలమయమై ఉండి రోడ్డుకు ఇరువైపులా మట్టి కొట్టుకుపోయి నారవులుగా ఏర్పడి పెద్ద పెద్ద రాళ్లు బయటపడటంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే పక్కకు తొలిగేందుకు కూడా వీలు లేకుండా ఉందని వాహనదారులు వాపోతున్నారు.

ఇదిలా ఉంటే ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అపాయం ఉందని అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

అగ్రికల్చర్ ఏఓ హఠాన్మరణం



శ్రీకర్ (ఫైల్)

పుల్లంపేట : పుల్లంపేట మండల వ్యవసాయ అధికారి కుర్నూతల శ్రీకర్ అనారోగ్యంతో తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. నేడు ఆయన స్వగ్రామమైన లక్కిరెడ్డిపల్లి మండలం చౌటుపల్లిలో దహన సంస్కారాలు నిర్వహించబడునని మృతుని బంధువులు తెలిపారు. ఆయన మరణం పట్ల పలువురు మండల అధికారులతోపాటు వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

వైభవంగా ముత్తు మారెమ్మ జాతర




అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో ముత్తు మారెమ్మ



మారెమ్మకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

నందలూరు : భక్తులు కొంగుబంగారంగా వెలుగొందుతున్న మండలంలోని అరవపల్లెలో వెలసిన శ్రీ ముత్తు మారెమ్మ జాతర మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. పోతురాజును మేళతాళాలతో ఊరేగింపుగా ఊరి పొలిమేర కన్యకా చెరువు వద్ద ఉన్న అనంతపురమ్మ ఆలయం వరకు వెళ్లి అనంతపురమ్మను వెంట తీసుకురాగా జాతర తంతు ప్రారంభమైంది. గ్రామంలోని ప్రతి వీధి నుంచి పెద్ద ఎత్తున మహిళలు అంబళ్లు తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ మొదలియార్, జాతర కమిటీ నిర్వాహకులు శ్రీరామ్ కిరణ్‌కుమార్, నాగరాజు, సేలం సుధాకర్, సేలం సురేష్, మురళి, ప్రశాంత్, దినేష్‌రెడ్డి, వెంకటరమణ, చెంగల్‌రాయుడు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బేపారి బషీర్‌ఖాన్ మృతి తీరనిలోటు



బేపారి లిల్లా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి ప్రాంత ప్రజలు సేవా దృక్పథం గల హాజీ బేపారి బషీర్‌ఖాన్‌ను కోల్పోవడం బాధాకరమైన విషయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. రాయచోటి పట్టణంలోని పెద్దాయన హాజీ బేపారి బషీర్‌ఖాన్ నివాసం వద్ద ఆయన తనయుడు బేపారి మహమ్మద్‌ఖాన్ లిల్లా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్‌బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు సుదర్శన్‌రెడ్డి, దేవనాథరెడ్డి, పలువురు కౌన్సిలర్లు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, ప్రముఖ సేవకులు జిన్నా షరీఫ్, పలువురు నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ నిర్మాణానికి భూమిపూజ



ప్రత్యేక పూజల్లో మధుసూదన్ రెడ్డి

ఓబులవారిపల్లె : మంగంపేట పునరావాస కాలనీ ఆర్ఆర్–1లో ఘనంగా వరసిద్ది వినాయక గుడి భూమిపూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. దాదాపు రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న వినాయకుడి గుడికి భూమిపూజ కార్యక్రమం సందర్భంగా ఉదయం నుంచి పూజారులు ప్రత్యేక పూజలు జరిపారు. గ్రామంలోని ప్రజలు, మహిళలు పెద్దఎత్తున భక్తిశ్రద్ధలతో కాయా కర్పూరం సమర్పించి పూజలు చేయించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మంగంపేట ఉప సర్పంచ్ కొలూరు మధుసూదన్ రెడ్డి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం అందజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. గ్రామస్తులు కల్లా చలపతి రూ.75 వేలు, కొట్టారు రమణ రూ.50 వేలు విరాళాలను అందజేశారు. కార్యక్రమంలో తల్లెం భరత్ కుమార్ రెడ్డి, సర్పంచ్ మునుగు సుధాకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

మదనపల్లె సిటీ: పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఏపీ సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.మునిగోపాలకృష్ణ కోరారు. ఆదివారం స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటుతామని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి ఉస్మాన్‌సాహెబ్, ప్రొఫెసర్ శ్రీనివాసులు, టీఎస్ఎ. క్రిష్ణమూర్తి, గొల్లపూడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ మదనపల్లె శాఖ ఆర్గనైజర్‌గా ఎస్.వి.నాయుడును ఎన్నుకున్నారు.

తప్పుడు పత్రాలతో అక్రమ నిర్మాణం

ఓ మహిళ ఆవేదన

కురబలకోట: కురబలకోట మండలం దొమ్మన్నబావి సమీపంలో హైవే పక్కన ఉన్న తమ స్థలాన్ని ఓ నాయకుడు తప్పుడు పత్రాలతో ఆక్రమించి అక్రమ నిర్మాణం చేశారని కురబలకోట కస్బాకు చెందిన పరివ్వీన్, రేష్మా, దివ్యాంగుడు రియాజ్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు మండలంలోని దొమ్మన్నబావి దగ్గర హైవే పక్కన వీరికి విలువైన భూమి ఉంది. 2005లో సబ్ డివిజన్ కూడా చేశారు. 2022లో హైవే విస్తరణలో భాగంగా నష్టపోయిన భూమికి పరిహారం కూడా అందుకున్నారు. మిగిలిన 28 సెంట్లు స్థలానికి 2023లో సబ్ డివిజన్ చేసి రెవెన్యూ రికార్డులో కూడా నమోదు చేశారు. తండ్రి నుండి వారసత్వంగా వచ్చిన ఈ భూమి వీరి స్వాధీన అనుభవంలో ఉంటూ వచ్చింది. హైవే పక్కన ఉండడంతో ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.4 కోట్లకు పైగా ఉంటోంది. కురబలకోటకు చెందిన ఓ పార్టీకి చెందిన నాయకుడు కూటమి నాయకుల అండదండలతో ఓ రూమును నిర్మించారు. ఇదేమిటని ప్రశ్నిస్తే తమపై దౌర్జన్యానికి వచ్చారని బాధిత మహిళలు వాపోతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా కూటమి నాయకులకు కొమ్ముకాయడంతో న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆమె తెలిపారు. ఈ విషయమై స్థానిక తహసీల్దారు ధనుంజయులను విచారించగా భూ సమస్యపై విచారించడంతో పాటు రికార్డులు పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కోసం ప్రార్థనలు

గుర్రంకొండ: అక్రమ కేసులో అరెస్టయిన ఎంపీ మిథున్‌రెడ్డి విడుదల కావాలని గుర్రంకొండలోని హజరత్ కమాల్‌బాషా దర్గాలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం స్థానిక హజరత్ కమాల్‌బాషా దర్గాలో జెడ్పీటీసీ సద్రీన్ ముక్తియార్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ముక్తియార్ అలీఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష గట్టి మిథున్‌రెడ్డిని వేధించడం దారుణమన్నారు. నిరాధారమైన ఆరోపణలతో కేసులు పెట్టి జైల్లో నిర్బంధించడం తగదన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఆయనపై అక్రమకేసులు పెట్టడం మానుకోవాలని కోరారు. గయాజ్ అహ్మద్, సిమెంట్ మురాషా, ఇర్షాద్, అన్వర్, ఇంతియాజ్, బ్రిటీష్, కమాల్‌బాషా, జమీర్ తదితరులు పాల్గొన్నారు.

అసంబద్ధ నిర్ణయాలతో నాణ్యమైన విద్య దూరం



యూటీఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజంపేట రూరల్ : కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న అసంబద్ధ నిర్ణయాలతో విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయలేక బోధనేతర పనులకు ఎక్కువ సమయం కేటాయించవలసి వస్తున్నదని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ చెంగల్‌రాజు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘం 52వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా ఏపీ యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. ఈ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చెంగల్‌రాజు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్‌ల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసే ఏకైక యూనియన్ యూటీఎఫ్ అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కాలయాపన చేయకుండా తక్షణమే పీఆర్‌సీ వేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని కూడా డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేసి పాత పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ వేడుకలలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణమూర్తి, మండల అధ్యక్షులు జి.నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి శివయ్య, సీనియర్ నాయకులు రమణయ్య, హరిప్రసాద్, పీఎస్ఎల్‌వీ ప్రసాద్, సుబ్బరాయుడు, నరసింహారావు, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణ వేడుక



వినాయక స్వామి కల్యాణాన్ని జరుపుతున్న వేదపండితులు

పెనగలూరు : మండల కేంద్రం పరిధి కొత్తపల్లెలో వినాయకుడి కల్యాణ క్రతువును కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం ఆలయంలో నిర్వహించిన ఈ వేడుకను పురోహితుడు చెంచు సుబ్బనరసయ్య ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణలతో జరిపించారు. ముందుగా సిద్ధి, బుద్ధి సమేత వినాయక స్వామి ఉత్సవమూర్తులను అలంకరించి ప్రత్యేకంగా కొలువుదీర్చిన వేదికపై కొలువుదీర్చారు. కల్యాణ క్రతువును తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ మొదటి వార్షికోత్సవం సందర్భంగా తలమంచి రమణారెడ్డి (ఉపాధ్యాయుడు) ఈ కల్యాణాన్ని జరిపించుటకు సహకరించారు.

12వ పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలి



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం రాష్ట్ర సెక్రటరీ చిన్నరెడ్డన్న

రాయచోటి జగదాంబసెంటర్ : 12వ పీఆర్‌సీ కమిషన్‌ను ప్రభుత్వం వెంటనే నియమించాలని ఎస్‌జీపీఏ ఏపీ రాష్ట్ర సెక్రటరీ బి.చిన్నరెడ్డన్న డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎస్‌జీపీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం వెంటనే ఐఆర్, డీఏ, డీఆర్‌లను వెంటనే ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మెడికల్ క్లెయిమ్‌ను రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని కోరారు. సంఘం బలోపేతానికి పెన్షనర్లందరూ తప్పనిసరిగా సభ్యత్వాన్ని తీసుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, పెన్షనర్స్ సంఘ సభ్యులు వెంకటరమణ, రామయ్య, అల్లాబకాష్, షరీఫ్, కరీముల్లా, రామచంద్రారెడ్డి, బాలకృష్ణారెడ్డి, ఆంజనేయులు, జనార్ధన్‌రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఘన నివాళి

లక్కిరెడ్డిపల్లి : మాజీ ఎంపీపీ అంబాబత్తిన రెడ్డయ్య మాతృమూర్తి, లక్కిరెడ్డిపల్లి జెడ్పీటీసీ రమాదేవి అత్త నరసమ్మ (80) శనివారం అనారోగ్యం కారణంగా మృతి చెందగా మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డితో కలిసి లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిలు నరసమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించి రెడ్డయ్య కుటుంబాన్ని పరామర్శించారు. వీరితోపాటు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు నరసమ్మ భౌతిక కాయానికి నివాళులు అర్పించారు.

మాజీ సర్పంచ్ రాజారెడ్డికి నివాళి

మద్దిరేవుల మాజీ సర్పంచ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్ మద్దిరేవుల రాజారెడ్డి చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్‌రెడ్డి, ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డిలు శ్రద్ధాంజలి ఘటించారు. మండలంలోని మద్దిరేవుల గ్రామం, రెడ్డివారిపల్లిలో రాజారెడ్డి దశదిన కర్మకాండ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. మద్దిరేవుల సురేంద్రనాథ్ రెడ్డి, శివామల్‌రెడ్డి, సంజీవరెడ్డి, శంకర్ రెడ్డి, నరసింహారెడ్డి, దప్పేపల్లి సిద్దారెడ్డి, సోమశేఖర్ రెడ్డి, రంగారెడ్డి, అశోక్ రెడ్డి, చక్రపాణి రెడ్డి, గోపాల్ రెడ్డి, బంగ్రెడ్డి శంకర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డిలు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

బాబు పాలనపై రెఫరెండం పెడితే తిరుగుబాటు

బి.కొత్తకోట: ఏడాది చంద్రబాబు పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ పెడితే ప్రజలు తిరుగుబాటు స్థాయిలో స్పందించి వ్యతిరేకిస్తారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు తన పాలన ద్వారా ఏం చేశారని ప్రశ్నించారు. ఆదివారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సూపర్ సిక్స్ టీడీపీకి గుండెకాయ, ఎన్ని కష్టాలైనా అమలు చేసి తీరుతాం అని పదేపదే ప్రకటించి, తీరా అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తారా అని నిలదీశారు. సంపద సృష్టించి ప్రజలకు పంచుతామని చెప్పి ఇప్పుడు పారిశ్రామికవేత్తలను పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి చేస్తారా అని ప్రశ్నించారు. ఎన్నికల హామీలపై గొప్పగా చెప్పుకున్న కూటమి నేతలు వాటిని అందరికి అమలు చేయకుండా మోసం చేశారన్నారు.

ఏ ఒక్క హామీనైనా కత్తెర వేయకుండా, నిజాయితీగా అమలు చేయలేదని విమర్శించారు. పేదరికం పోవాలంటే పారిశ్రామిక వేత్తలు దత్తత తీసుకోవడం కాదని, ఆర్థి క, సామాజిక అసమానతలను రూపమాపాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని, ఆ విషయం విస్మరించి వ్యవహరించడం ఫర్టీఇయర్స్ ఇండస్ట్రీగా చెప్పుకునే చంద్రబాబుకు తెలియకపోవడం హస్యాస్పదమన్నారు. పారిశ్రామికవేత్తలు, అధికారుల దత్తతతో పేదరిక నిర్మూలన అసాధ్యమన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గుర్రంకొండ: మండలకేంద్రమైన గుర్రంకొండలోని ఏపీ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్ల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శిరీష సూచించారు. ఆదివారం స్థానిక పాఠశాలలో విలేకరులతో మాట్లాడుతూ 2025–26 సంవత్సరానికిగానూ 5,6,7, 8 తరగతులలో ఖాళీగా ఉన్న 90సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరిక్ష నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 14 తేదీ సాయంకాలం లోపు పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొన్న విద్యార్థులకు ఈనెల 16 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

అట్టహాసం.. 'ఉప' ప్రచారం

ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారం ఆదివారంతో ముగిసింది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు చివరి రోజు ప్రచారాన్ని ముమ్మరంగా సాగించారు. పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచార ర్యాలీలో పాల్గొన్నారు. టీడీపీ నేతృత్వంలోని కూటమి పార్టీల ప్రభుత్వం సాగిస్తున్న మోసపూరిత పాలనను ప్రజలకు వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగించిన వైఎస్సార్‌సీపీకి అండగా నిలిచి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డిని మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

– ఒంటిమిట్ట



పుల్లంపేట: ఎన్నికల ప్రచారంలో కొరముట్ల, అజయ్‌రెడ్డి, ముస్తాక్ తదితరులు



వైఎస్సార్‌సీపీ ర్యాలీలో కార్యకర్త తీన్‌మార్



ర్యాలీలో కడపకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు